సాక్షి
అన్నమయ్య జిల్లా
బుధవారం। 17। జనవరి। 2024



రాతపై పట్టు.. మార్కులు రాబట్టు

పరీక్షల్లో మార్కులు రాబట్టాలంటే.. చేతిరాత బాగుండటం ఎంతో ముఖ్యమని చేతిరాత నిపుణులు సూచిస్తున్నారు. -8లో



ఉత్సాహంగా బండలాగుడు పోటీలు

చాపాడు మండలంలోని వెదురూరు, నరహరిపురంలో రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు ఉత్సాహంగా జరిగాయి. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.180	రూ.240
రెండోరకం	రూ.100	రూ.178



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 24 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	330	430
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 18.080 కిలోలు

కడప కల్చరల్ : నగరంలో గంగిరెద్దుల సందడి



ఊరంతా కొత్త కాంతి..
సంబరాల సంక్రాంతి

- ఉల్లాసంగా పల్లెలు, పట్టణాలు
- అంతటా ఆనందోత్సాహాలు



రాజంపేట రూరల్ : రాజంపేటలో తాడు లాగుడు పోటీలో మహిళలు



రాజంపేట టౌన్: కూచివారిపల్లెలో వేసిన చిట్లాకుప్ప

సాక్షి, రాయచోటి: జిల్లాలో సంక్రాంతి పండుగను వైభవంగా నిర్వహించారు. భోగితో ప్రారంభమైన ఆనందోత్సాహాలు రెండవ, మూడవ రోజైన సంక్రాంతి, కనుమల్లో కూడా వెల్లి విరిశాయి. పల్లెలు, పట్టణాల్లో ఇళ్లు బంధుమిత్రులతో కళకళలాడాయి. బయటి ప్రాంతాల్లో ఉద్యోగం చేసుకుంటూ పండుగ కోసం వచ్చిన వారితో ఇళ్లన్నీ సందడిగా మారాయి. పలుచోట్ల మంగళవారం సంక్రాంతి నాడు ఉదయాన్నే తలస్నానాలు చేసి పెద్దలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా దివంగతులైన కుటుంబ పెద్దలకు శాస్త్రోక్తంగా కర్మకాండలు జరిపించారు. ముఖ్యంగా కాలువలు, చెరువులు, నదీ తీరాలలో ఈ కార్యక్రమాలు నిర్వహించారు. పుష్పగిరిలోని పెన్నా ఒడ్డున చుట్టుపక్కల గ్రామాలతోపాటు కడప నగరం నుంచి కూడా పెద్ద ఎత్తున ప్రజలు తరలివెళ్లి పెద్దలకు పిండ ప్రదానం చేశారు.

కోలాహలంగా కనుమ

పండుగ చివరినాడు బుధవారం కనుమను సంప్రదాయబద్ధంగా, కోలాహలంగా నిర్వహించారు. పలుచోట్ల స్థానికంగా రైతులు, గ్రామీణ యువతను ప్రోత్సహించేందుకు ఎడ్ల పందాలు, అల్లెంగుండు ఎత్తడం లాంటి గ్రామీణ పోటీలు నిర్వహించారు. ఇంకొన్ని చోట్ల బిర్రు బండ్లు, బండ్ల పందాలు ఏర్పాటు చేశారు. దాదాపు అన్ని మండలాల్లోనూ ఎక్కడో ఒకచోట స్థానిక పెద్దలు, యువకులు కలిసి కోడి పందాలు నిర్వహించారు. ఓ మోస్తరుగా నగదు కూడా పందాల రూపంలో చేతులు మారినట్లు సమాచారం. దాదాపు అన్ని గ్రామాల్లోనూ కనుమ పండుగ నాడు పశువుల పండుగను ఉత్సాహంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఎడ్లు, పశువులను శుభ్రం చేసి పూజలు చేశారు. ముఖ్యంగా ఎడ్లను రంగురంగుల కుచ్చులు, గజ్జెల పట్టీలతో అలంకరించారు. స్వచ్ఛంద సంఘాల ఆధ్వర్యంలో గ్రామాల్లో స్థానికంగా గ్రామీణ ఆటల పోటీలు నిర్వహించారు. పట్టణాలతోపాటు కడప నగరంలో కూడా కబడ్డీ, ఇతర గ్రామీణ క్రీడలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. రాత్రి దేవాలయాల సమీపంలో పార్వేట కార్యక్రమాన్ని ఉత్సాహ భరితంగా నిర్వహించారు.

అంతటా సంతోషం

పండుగల్లో ముఖ్యమైనదిగా, పెద్దదిగా భావించే సంక్రాంతిని ఈ ఏడాది కూడా జిల్లా వాసులు సంతోషంగా నిర్వహించుకున్నారు. పల్లెలతోపాటు పట్టణాలు, కడప నగరంలో కూడా పండుగ సందడి కనిపించింది. ముఖ్యంగా పల్లెల్లో బంధుమిత్రులతో ఇళ్లు కళకళలాడాయి. కుటుంబ సభ్యులతోపాటు ఇతర మతాలకు చెందిన సన్నిహితులు, మిత్రులను కూడా కనుమ నాడు విందు భోజనానికి ఆహ్వానించారు. రాత్రి వరకు పలు ముచ్చట్లతో ఆనందంగా గడిపారు. తెల్లవారుజామున ఐదు గంటల నుంచే మాంసం, చికెన్ సెంటర్ల వద్ద రద్దీ కనిపించింది. అదును చూసి మాంసం ధరను రూ.800 నుంచి రూ.850, రూ.140గా ఉండిన చికెన్ ధర రూ.200కు చేరింది. అయినా దుకాణాల వద్ద మధ్యాహ్నం వరకు రద్దీ తగ్గలేదు. కొన్నిచోట్ల మహిళలు బంధుమిత్రులను ఇంటికి ఆహ్వానించి పేరంటాళ్ల కార్యక్రమాన్ని నిర్వహించారు.

వైభవం.. పార్వేట ఉత్సవం



ఒంటిమిట్ట : పార్వేటి మండపానికి ఉత్సవమూర్తులను తీసుకొస్తున్న దృశ్యం

ఒంటిమిట్ట: జిల్లాలో కనుమ పండుగను పురస్కరించుకుని మంగళవారం పార్వేట ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఒంటిమిట్టలో శ్రీరాముల వారి పార్వేట ఉత్సవాన్ని టీటీడీ ఆలయ డిప్యూటీ ఈఓ నటేష్ బాబు ఆధ్వర్యంలో చేపట్టారు. శ్రీ సీతారామలక్ష్మణుల ఉత్సవ మూర్తులకు ఆలయ అర్చకులు వీణారాఘవాచార్యులు, వీణా మనోజ్ కుమార్ ప్రత్యేక అలంకరణలు చేసి పూజలు నిర్వహించారు. అనంతరం భాజాభజంత్రీల నడుమ ఉత్సవ మూర్తులకు గ్రామోత్సవం చేశారు. ఈ సందర్భంగా చెరువు వద్ద ఉన్న మండపంలో మూల విరాట్‌ను ఉంచి కొబ్బరికాయ కొట్టి పూజలు చేశారు. అలాగే సమీప నాగేటి తిప్పపై టీటీడీ వారు దాదాపు రూ.60 లక్షలతో నూతనంగా నిర్మించిన సులువైన మార్గంలో ఉత్సవ మూర్తులను తీసుకువెళ్లి పరంధాముడి పార్వేట ఉత్సవాన్ని ఆలయ సంప్రదాయల ప్రకారం నిర్వహించారు. అనంతరం మాడవీధుల్లో వైభవంగా స్వామి ఊరేగింపు చేశారు.



పీలేరు : కర్ణాటక కళాకారుల వేషధారణ



గుర్రంకొండ: పాడిఆవుకు అందంగా అలంకరణ



వల్లూరు : పుష్పగిరిలో పార్వేటలో కుందేలును వదులుతున్న దృశ్యం



మదనపల్లె సిటీ : గొబ్బెమ్మ పాటలు పాడుతున్న మహిళలు



మదనపల్లె సిటీ : గొబ్బెమ్మకు పూజలు చేస్తున్న మహిళలు


న్యూస్‌రీల్

ఒంటిమిట్టలో తెలంగాణ డీజీ



ఒంటిమిట్ట: ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయంలోని సీతారామలక్ష్మణులను తెలంగాణ రాష్ట్ర ఇంటెలిజెన్స్ బ్యూరో డీజీ బి. సుమతి మంగళవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ లాంఛనాలతో ఆమెకు అర్చకులు స్వాగతం పలికి, ప్రదక్షిణ గావించి, గర్భాలయంలోని మూల విరాట్‌కి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సైకిల్‌పై దేశాటన



పులివెందుల టౌన్: నేటి యువత మాదకద్రవ్యాలు వినియోగించి నిండు జీవితాన్ని నాశనం చేసుకోవద్దని, ప్రాణాపాయ స్థితిలో రక్తదానం చేయాలని, వాతావరణ మార్పులపై అవగాహన పెంచుకోవాలని బంగ్లాదేశ్‌కు చెందిన యువకుడు బీర్‌కుమార్ సైకిల్ యాత్ర చేపట్టాడు. గతేడాది డిసెంబర్ 19న బంగ్లాదేశ్ నుంచి మొదలుపెట్టిన తన యాత్రలో 2800 కిలోమీటర్లు ప్రయాణించి మంగళవారం పులివెందుల చేరుకున్నాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జార్ఖండ్ , ఒడిశా, ఛత్తీస్‌గఢ్, తెలంగాణలో యాత్ర పూర్తి చేసుకొని ఆంధ్రప్రదేశ్‌లోకి రెండురోజుల క్రితం వచ్చానన్నారు.

సమస్యలకు టాటా..
సంతోషాల బాట

- విలీనంతో ఆర్టీసీ ఉద్యోగుల్లో హర్షాతిరేకం
- సీఎం జగన్ సాహసోపేత నిర్ణయంతో ఉద్యోగ భద్రత
- జిల్లాలో 2,155 కుటుంబాల్లో ఆనందం
- ప్రభుత్వ విలీనమై నాలుగేళ్లు పూర్తి



మదనపల్లె ఆర్టీసీ డిపోలో బస్సులు

డిపో	మొత్తం ఉద్యోగులు
మదనపల్లె-1	456
మదనపల్లె-2	417
పీలేరు	431
రాజంపేట	337
రాయచోటి	500
ఆర్ఎం కార్యాలయం	14

మదనపల్లె సిటీ: ఆర్టీసీ ప్రభుత్వ రంగ సంస్థ అయినా.. కార్మికులకు అడుగడుగునా అవస్థలు తప్పేవి కాదు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జీతభత్యాలు అనే అన్న మాటలేదు. సంస్థ నష్టాల్లో ఉన్నా, ఏవైనా ఒడుదొడుకులు ఎదురైనా సకాలంలో వేతనాలు అందేవి కావు. సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేస్తే జీతంలో కోతలు విధించేవారు. ఇదంతా గతం. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి తీసుకున్న సాహసోపేత నిర్ణయంతో సంస్థ కార్మికుల జీవితాల్లో వెలుగులు నిండాయి. వారికి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు వచ్చింది. ఉద్యోగ భద్రత లభించింది.

విలీనమై నాలుగేళ్లు

ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేసి నాలుగేళ్లు పూర్తయ్యాయి. ఎన్నికల ముందు ఇచ్చిన హామీని ఆచరణలోకి పెట్టేందుకు ముఖ్యమంత్రిగా వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన మూడు నెలల్లో కమిటీ వేశారు. ఆరు నెలల్లో ఆచరణలో పెట్టారు. 2020 జనవరి ఒకటో తేదీ నుంచి అమల్లోకి తేవడంతో కార్మికులంతా ప్రజా రవాణా శాఖ ప్రభుత్వ ఉద్యోగులుగా మారారు. దశాబ్దాల తరబడి ఎవరూ చేయని సాహసోపేత నిర్ణయాన్ని ముఖ్యమంత్రి అమల్లోకి తీసుకొచ్చారు. అప్పటి నుంచి ఉద్యోగుల కష్టాలు తొలగిపోయాయి. నాలుగేళ్లుగా వారికి ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జీతాలు, బెనిఫిట్స్, అలవెన్స్ అందుతున్నాయి. ఈ నిర్ణయంతో జిల్లాలో 2,155 కుటుంబాల్లో సంతోషాలు నిండాయి.

నాడు సమ్మెలు చేస్తే జీతాలు కట్

ఆర్టీసీ ఇస్తున్న వేతనాలు చాలక డ్రైవర్లు, కండక్టర్లు, ఇతర కార్మికులు ఎన్నో సార్లు సమ్మెలు, పోరాటాలు చేశారు. అయినా తగిన ప్రతిఫలం దక్కలేదు. గత టీడీపీ ప్రభుత్వం కార్మికులను వేధించి, సమ్మె కాలానికి జీతాలు కోసి ఉక్కుపాదం మోపింది. ఉద్యోగ భద్రత కరువై కార్మికులు రోజులు లెక్కపెట్టుకున్నారు. వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాకే తమ సమస్యలకు పరిష్కారం లభించిందని ఆర్టీసీ ఉద్యోగులు స్పష్టం చేస్తున్నారు.

లాక్‌డౌన్‌లోనూ ఠంచన్‌గా జీతాలు

కరోనా సమయంలో లాక్‌డౌన్ కారణంగా రెండేళ్లలో సుమారు నాలుగు నెలలకు పైగా బస్సులన్నీ డిపోలకే పరిమితమయ్యాయి. ఆ పరిస్థితులు గతంలో ఎదురైతే కార్మికుల వేతనాల్లో కోతలు పడేవి. అప్పటికే ప్రభుత్వంలో విలీనం చేయడంతో ఎన్ని కష్టాలు ఉన్నా ఒకటో తేదీన ఠంచన్‌గా జీతాలు అందాయి. ఇలా జీతాలు చెల్లించడం చరిత్రలో మొదటిసారి అని ఉద్యోగులు పేర్కొన్నారు.

మాట తప్పని ముఖ్యమంత్రి



ఆర్టీసీ కార్మికుల సమస్యలకు సీఎం జగన్‌మోహన్ రెడ్డి శాశ్వత పరిష్కారం చూపారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే ఆర్టీసీ విలీనం ప్రక్రియ పూర్తి చేసి మాట నిలుపుకొన్నారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోనూ జీతాలు బ్రేక్ లేకుండా చూశారు. ఆర్టీసీ కార్మికుల మేలు కోరిన ఏకైక ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి. –రెడ్డప్ప, సీసీఎస్ డెలిగేట్, మదనపల్లె ఆర్టీసీ వన్ డిపో

ప్రభుత్వ ఉద్యోగులతో సమానం



ఆర్టీసీ ఉద్యోగులుగా ఉన్నప్పుడు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నాం. చాలీచాలని వేతనాలు, అలవెన్స్‌లు, జీతాల పెంపు కోసం సంఘాలు ఆందోళన చేసినా.. మాకు సరైన న్యాయం జరిగేది కాదు. అయితే ఇప్పుడు ప్రజా రవాణా శాఖలోకి విలీనం చేయడంతో.. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జీతాలు, అలవెన్స్ అందుతున్నాయి. –బాబు, ఈయూ కార్యదర్శి, మదనపల్లె ఆర్టీసీ టూ డిపో

భరోసా వచ్చింది



రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కార్మికులుగా ఉన్నప్పుడు మాకు ఉద్యోగ భద్రత ఉండేది కాదు. ఏదైనా పొరపాటు జరిగినా.. ఆర్టీసీ సంఘాలు చేపట్టే ఆందోళనలో పాల్గొన్నా ఒత్తిళ్లు, బెదిరింపులు ఉండేవి. ఇప్పుడు ఆ సమస్య లేదు. ప్రభుత్వంలో విలీనం చేయడంతో జీతభత్యాలపై భరోసా వచ్చింది. – హుస్సేన్, కండక్టర్, మదనపల్లె ఆర్టీసీ టూ డిపో

అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు
తరలి రావాలి

ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్



అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎస్సీ కమిషన్ చైర్మన్, దళిత నేతలు

కడప సెవెన్‌రోడ్స్: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన బీఆర్ అంబేడ్కర్ కాంస్య విగ్రహం, స్మృతివనం ప్రారంభోత్సవానికి జిల్లా ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్ తెలిపారు. మంగళవారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో కనీవినీ ఎరుగని రీతిలో చారిత్రాత్మకమైన స్వరాజ్ మైదానంలోని 20 ఎకరాల్లో రూ.400 కోట్ల వ్యయంతో 125 అడుగుల ఎత్తు గల అంబేడ్కర్ విగ్రహాన్ని ఈ నెల 19న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరిస్తున్నారన్నారు. విగ్రహంతోపాటు మూడు వేల మంది కూర్చొనే మల్టీ కన్వెన్షన్ హాలు, ఓపెన్ థియేటర్, లైబ్రరీ, ధ్యానం కోసం ప్రత్యేక హాలు, గ్రీనరీలతో ప్రభుత్వం అద్భుతమైన కళాఖండంగా తీర్చిదిద్దిందన్నారు. అంబేడ్కర్ అందించిన రాజ్యాంగంతోనే దేశ ప్రజలు స్వేచ్ఛగా, సమానత్వంతో జీవిస్తున్నారని తెలిపారు. అందరివాడైన అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు పార్టీలు, కులాలు, మతాలకు అతీతంగా ప్రజలు తరలి రావాలని కోరారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సమావేశంలో సోషల్ వెల్ఫేర్ డీడీ సరస్వతి, సమాచారశాఖ సహాయ సంచాలకులు వేణుగోపాల్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ నాయకుడు సీహెచ్ వినోద్‌కుమార్, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సీఎం వైఎస్ జగన్‌కు ఘన స్వాగతం, వీడ్కోలు



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి, మేయర్ సురేష్ బాబు



కలెక్టర్ విజయరామరాజు



ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి

కడప కార్పొరేషన్ : శ్రీ సత్యసాయి జిల్లా పాల సముద్రంలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పర్యటనలో పాల్గొనేందుకు గన్నవరం నుంచి విమానంలో కడప విమానాశ్రయానికి చేరుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. మధ్యాహ్నం 1.05 గంటలకు కడప విమానాశ్రయం చేరుకున్న ముఖ్యమంత్రికి డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, శాసన మండలి వైస్ చైర్మన్ జకియా ఖానం, కలెక్టర్ విజయరామరాజు, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, కడప నగర మేయర్ సురేష్‌బాబు, ఎమ్మెల్యేలు రఘురామిరెడ్డి, డాక్టర్ సుధీర్‌రెడ్డి, ఆర్టీసీ చైర్మన్ ఎ.మల్లికార్జునరెడ్డి, ఉద్యాన శాఖ సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, ఆర్టీఓ మధుసూదన్‌లు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.

- అనంతరం పర్యటన ముగించుకొని సాయంత్రం 6.23 గంటలకు కడప విమానాశ్రయం చేరుకున్న ముఖ్యమంత్రికి ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా, కలెక్టర్ విజయరామరాజు, డీఐజీ సెంథిల్ కుమార్, ఎమ్మెల్సీలు ఎంవీ రామచంద్రారెడ్డి, రమేష్ యాదవ్, మేయర్ సురేష్ బాబు, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి తదితరులు వీడ్కోలు పలికారు.

మల్లయ్యకొండపై 20న వేలం

తంబళ్లపల్లె: మల్లయ్యకొండపై జరిగే శివరాత్రి వేడుకల్లో భాగంగా భక్తుల తలనీలాలు, ఆలయాలలో పూజల నిర్వహణ, వాహనాల పార్కింగ్ టోల్‌గేట్ హక్కులకు ఈ నెల 20న బహిరంగ వేలం వేయనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కేఆర్ మల్‌రెడ్డి, ఈవో రమణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

క్లుప్తంగా

కర్ణాటక మద్యం తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

మదనపల్లె : కర్ణాటక మద్యం తరలిస్తున్న ఇద్దరు నిందితులను సోమవారం అరెస్ట్ చేసినట్లు రూరల్ సీఐ ఎస్.శేఖర్ తెలిపారు. కర్ణాటకలోని శ్రీనివాసపురం తాలూకా ఎర్రంవారిపల్లెకు చెందిన రెడ్డెప్ప(44) సోమవారం ఐదు బాటిళ్ల కర్ణాటక మద్యం తెస్తుండగా, చీకలబైలు చెక్‌పోస్ట్ వద్ద అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. అలాగే మదనపల్లె మండలం బెస్తపల్లెకు చెందిన వెంకటేష్(27) మూడు బాటిళ్ల కర్ణాటక మద్యం తరలిస్తుండగా చీకలబైలు చెక్‌పోస్ట్ వద్ద అరెస్ట్ చేసి మద్యం స్వాధీనం చేసుకున్నామన్నారు.

గొంతు కోసుకుని ఆత్మహత్యాయత్నం


చికిత్సపొందుతున్న లక్ష్మీదేవి

బి.కొత్తకోట : భర్త మందలించాడని గొంతు కోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వివాహిత ఉదంతం సోమవారం రాత్రి బి.కొత్తకోటలో జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు వివరాలు. లక్ష్మీదేవి, నరసింహులు భార్యాభర్తలు. వీరికి ఇద్దరు సంతానం. లక్ష్మీదేవి మూడో సారి గర్భం దాల్చింది. అయితే ఆమె బిడ్డలు కలగకుండా మాత్రలు తీసుకుంది. మాత్రలు మింగిన విషయం తెలుసుకున్న నరసింహులు మాత్రలు ఎందుకు మింగావని మందలించాడు. దీంతో మనస్తాపానికి గురైన లక్ష్మీదేవి గొంతుకోసుకుంది. సమాచారం అందుకున్న 108 సిబ్బంది బాధితురాలిని స్థానిక సీహెచ్‌సీకి తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం 108లో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లారు.

కోడిపందెంరాయుళ్ల అరెస్టు


పోలీసుల అదుపులో ఉన్న నిందితులు

రైల్వేకోడూరు : రైల్వేకోడూరు మండలంలో సంక్రాంతి వేడుకలలో భాగంగా సోమ, మంగళవారాలలో కోడి పందేలు నిర్వహిస్తున్న తొమ్మిది మందిని పోలీసులు అరెస్టు చేసి రూ. 19040 నగదు, 13 కోడిపుంజులను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.


33 మద్యం బాటిళ్లు స్వాధీనం


మద్యం బాటిళ్లు, నిందితుడితో పోలీసులు

సిద్దవటం : మండలంలోని భాకరాపేట చెక్‌పోస్టు వద్ద అక్రమంగా తరలిస్తున్న 33 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్టు చేశామని ఎస్ఐ పెద్దఓబన్న తెలిపారు. ఈనెల 15వ తేదీ సోమవారం తెల్లవారుజామున ఒంటిమిట్ట సీఐ పురుషోత్తంరాజు, సిబ్బంది ఎన్నికల విధుల్లో భాగంగా వాహనాలను తనిఖీ నిర్వహించామన్నారు. రైల్వేకోడూరుకు చెందిన బత్తల చెంగయ్య అనే వ్యక్తి హైదరాబాద్ నుంచి, తిరుపతి వెళ్లే ప్రైవేటు బస్సుల్లో 24 బీరు సీసాలు, 750 ఎంఎం 9 మద్యం బాటిళ్లను అక్రమంగా తరలిస్తుండగా తనిఖీలో స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ శివప్రసాద్‌రెడ్డి, పోలీసులు, ఎస్ఈబీ ఎస్ఐ పురుషోత్తం బాబు, పోలీసులు పాల్గొన్నారు.

రాతపై పట్టు... మార్కులు రాబట్టు

- పరీక్షల్లో మార్కులపై ప్రభావం చూపనున్న చేతిరాత
- టెన్త్, ఇంటర్ పరీక్షలకు ఆసన్నమైన సమయం
- విద్యార్థులు దస్తూరిపై సాధన చేయాలంటున్న నిపుణులు



రాజంపేట టౌన్ : టెన్త్, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు టైమ్‌టేబుల్ కూడా వచ్చేసింది. అత్యుత్తమ మార్కులతో ఉత్తీర్ణత సాధించాలన్న లక్ష్యంతో అనేక మంది విద్యార్థులు ఓ ప్రణాళికను సైతం రూపొందించుకొని చదవడం ప్రారంభించారు. అయితే ఏడాది పాటు చదివిన విషయాలను జవాబు పత్రంపై రాసే విధానం వల్ల కూడా మార్కులు ఆధారపడి ఉంటాయి. అయితే ఈ విషయంపై ప్రత్యేక దృష్టి సారించే విద్యార్థులు తక్కువ మంది మాత్రమే ఉంటారు. విద్యార్థులు పరీక్షల్లో ప్రశ్నలకు సమాధానాలు రాయడం ఎంత ముఖ్యమో చేతిరాత కూడా అంతే ముఖ్యమన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని చేతిరాత నిపుణులు సూచిస్తున్నారు. చేతిరాత బాగుంటే మూల్యాంకనం చేసే వారికి సులువుగా అర్థమవుతుంది. ఫలితంగా మంచి మార్కులు వేస్తారు. చేతిరాత బాగాలేకపోతే మూల్యాంకనం చేసే వారికి సమాధానం అర్థంకాక పోతే మార్కులు తగ్గించే అవకాశం ఉంటుంది. ఇది ఫలితాలపై కూడా ప్రభావం చూపే అవకాశముంది. అందువల్ల విద్యార్థులు చేతిరాతపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇంటర్మీడియట్ పరీక్షలకు దాదాపు ఒకటిన్నర నెల, టెన్త్ పరీక్షలకు రెండు నెలల సమయం మాత్రమే ఉంది. అందువల్ల విద్యార్థులు రోజుకు అర్ధగంట అయినా చేతిరాతపై సాధన చేయాలని నిపుణులు సూచిస్తున్నారు. పరీక్షల్లో చేతిరాత ఎలాఉండాలో నిపుణుల మాటల్లోనే..

- ప్రతి విద్యార్థి ఆన్సర్‌షీట్ (బుక్‌లెట్)లో సమాధానాలను స్పష్టంగా రాయాలి.
- ఒకలైనుకు మరో లైనుకు సెంటీమీటర్ గ్యాప్ ఇవ్వాలి.
- పదానికి, పదానికి తగనంత (ఒకటి లేదా రెండు అక్షరాల) స్పేస్ ఇవ్వాలి.
- బుక్‌లెట్‌లో వాక్యాలు పైకి కిందకు లేకుండా వరుస క్రమంలో ఉండాలి.
- బొటన వేలు, మూడవ వేలికి మధ్య చూపుడు వేలు సహాయంతో పెన్నును చక్కగా పట్టుకోవాలి. ఇలా చేయడం వల్ల రాసే సమయంలో పెన్ను స్పీడుగా ముందుకు కదులుతుంది.
- ముఖ్యంగా పరీక్షల సమయంలో విద్యార్థులు తగినంత విశ్రాంతి తీసుకోవాలి. విశ్రాంతి లేకుంటే ఆ ప్రభావం చేతిరాతపై కూడా పడుతుంది.
- మనసు ప్రశాంతంగా ఉంటే చేతిరాత చక్కగా వస్తుంది.

సాధన తప్పనిసరి



చక్కటి చేతిరాత సాధనతోనే సాధ్యం కాగలదు. పరీక్షలకు ఇంకా సమయం ఉన్నందున విద్యార్థులు అక్షరాలను గుండ్రంగా రాసేందుకు సమయం కేటాయించుకొని సాధన చేయాలి. చాలా మంది తొలి ప్రశ్నకు గుండ్రటి అక్షరాలతో సమాధానం రాస్తారు. ఆ తరువాత సమయం అయిపోతుందన్న ఆందోళనతో వేగంగా రాయడం ప్రారంభిస్తారు. అందువల్ల గుండ్రటి అక్షరాలు కుదరవు. ఈ ప్రభావం మార్కులపై పడుతుంది. సమాధానాలు గుండ్రంగా రాయాలంటే సాధన తప్పనిసరి. – నటవ నరసింహులు, చేతిరాత నిపుణుడు, రాజంపేట

దేనేపల్లెలో యువకుడి హత్య

నలుగురిపై కేసు నమోదు


హత్యకు గురైన బాలయ్య

ముద్దనూరు : మండలంలోని దేనేపల్లె గ్రామంలో కొలిమి చిన్న బాలయ్య(31)అనే యువకుడు సోమవారం హత్యకు గురయ్యాడు. హత్యకు దారితీసిన పరిస్థితులను ఇన్‌చార్జి సీఐ ఈశ్వరయ్య మీడియాకు వెల్లడించారు. రెండు రోజుల క్రితం దేనేపల్లెకు చెందిన గంగాధర్ కూతురిని అదే గ్రామానికి చెందిన బాలయ్య సమీప బంధువు రామాంజినేయులు అనే యువకుడు పెళ్లి చేసుకోవాలని కోరాడు. అయితే గంగాధర్, అతని సోదరుడు పుల్లయ్య ఈ పెళ్లికి ఇష్టపడలేదు. ఈ నేపథ్యంలో సోమవారం సాయంత్రం పండుగ సందర్భంగా బాలయ్య అతని భార్య బాలక్క గ్రామంలోని గుడి వద్దకు వెళ్లారు. అదే గుడిలో పుల్లయ్య అతని భార్య అంకాలమ్మలు పూజారులుగా వ్యవహరిస్తున్నారు. అదే సమయంలో పుల్లయ్య సోదరుడు గంగాధర్ అతని కుమారుడు శివకుమార్‌లు కూడా గుడి వద్దనే ఉన్నారు. ఈ సమయంలో మన అమ్మాయిని పెళ్లి చేసుకొమ్మని రామాంజినేయులును బాలయ్య ప్రోత్సహిస్తున్నాడంటూ పుల్లయ్య, అంకాలమ్మ, శివకుమార్‌లు బాలయ్యతో ఘర్షణకు దిగారు. ఈ ఘటనలో అంకాలమ్మ, శివకుమార్, గంగాధర్‌లు బాలయ్యను పట్టుకున్నారు. పుల్లయ్య గుడిలో వినియోగించే టెంకాయలు ఒలిచే కడ్డీతో బాలయ్య గుండెపైన పొడిచాడు. దీంతో ప్రాణాపాయ స్థితిలోకి వెళ్లిన బాలయ్యను చికిత్స నిమిత్తం 108 వాహనంలో జమ్మలమడుగుకు తరలించారు. అక్కడే అతను మృతి చెందాడు. ఈ హత్య కేసు ఘటనలో పుల్లయ్య, అంకాలమ్మ, గంగాధర్, శివకుమార్‌లపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌చార్జి సీఐ తెలిపారు.

జోన్ వ్యాప్తంగా 168 ప్రత్యేక బస్సులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప జోన్ వ్యాప్తంగా అనంతపురం, అన్నమయ్య, చిత్తూరు, కర్నూలు, నంద్యాల, సత్యసాయి, తిరుపతి, వైఎస్సార్ జిల్లాల పరిధిలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని తిరుగు ప్రయాణికుల కోసం 168 ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని ఇన్‌చార్జి ఈడీ చెంగల్‌రెడ్డి తెలిపారు.

- అనంతపురం రీజియన్ నుంచి హైదరాబాదు 10, బెంగళూరు 18, చెన్నై 2, ఇతర ప్రాంతాలకు ఒక బస్సు చొప్పున మొత్తం 31 బస్సులు నడుపుతామన్నారు.
- అన్నమయ్య జిల్లా నుంచి హైదరాబాదు 1, బెంగుగరు 15, చెన్నై 1, ఇతర ప్రాంతాలకు 3 కలిపి మొత్తం 20 బస్సులు నడుస్తాయన్నారు.
- చిత్తూరు నుంచి హైదరాబాదుకు 2, బెంగళూరు 15, ఇతర నగరాలకు 2 కలిపి మొత్తం 19 బస్సులు ఏర్పాటు చేశామన్నారు.
- కర్నూలు నుంచి హైదరాబాదు 6, బెంగళూరు 7, చెన్నై, విజయవాడలకు ఒక్కొక్కటి చొప్పున మొత్తం 15 బస్సులు రాకపోకలు సాగిస్తాయన్నారు.
- నంద్యాల నుంచి హైదరాబాదు 7, బెంగళూరు 2 కలిపి మొత్తం 9 బస్సులు నడుస్తాయన్నారు.
- సత్యసాయి నుంచి హైదరాబాదు 5, బెంగళూరు 11, ఇతర నగరాలకు 11 కలిపి మొత్తం 27 బస్సులు నడుస్తాయన్నారు.
- తిరుపతి నుంచి హైదరాబాదు 1, బెంగళూరు 20 కలిపి మొత్తం 21 బస్సులు నడుస్తాయన్నారు.
- వైఎస్సార్ జిల్లా నుంచి హైదరాబాదు 18, బెంగళూరు 21, చెన్నై 4 కలిపి మొత్తం 43 బస్సులు చొప్పున నడుస్తాయన్నారు.

వీటిలో హైదరాబాదుకు 50, బెంగళూరుకు 109, చెన్నై 8, విజయవాడ 1, ఇతర నగరాలకు 17 చొప్పున మొత్తం 168 బస్సులు నడుపుతున్నాయని వివరించారు. వీటిలో ఇప్పటికే రిజర్వేషన్ సౌకర్యం కల్పించాయని తెలియజేశారు. ప్రయాణికుల రద్దీని బట్టి బస్సులను పెంచుతామన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం


పోలీసుల అదుపులో షేక్ వలీబాషా


స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లతో ఎస్ఐ

వేంపల్లె : స్థానిక కాలేజీ రోడ్డులో 11లిక్కర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తిరుపాల్‌నాయక్ తెలిపారు. సోమవారం సీఐ చాంద్‌బాషా ఆదేశాల మేరకు వేంపల్లె పట్టణంలో దాడులు నిర్వహించామన్నారు. కాలేజీరోడ్డులోని షేక్‌వలీబాషా లిక్కర్ బాటిళ్లను అమ్ముతుండగా పట్టుకొని వాటిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే స్థానిక ఐటీఐ సమీపంలో ఎస్సీ కాలనీకి చెందిన ఈశ్వరయ్య నుంచి 26 అక్రమ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తిరుపాల్ నాయక్ తెలిపారు. అతనిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేశామన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

సింహాద్రిపురం : మండల పరిధిలోని నంద్యాలంపల్లె గ్రామంలో ఈశ్వర్‌రెడ్డి అనే వ్యక్తి నుంచి మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రోషన్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గ్రామంలో మద్యం అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో దాడి నిర్వహించి 15 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితునిపై కేసు నమోదు చేశామన్నారు.

బెంగళూరు సమీపంలో బీటెక్ విద్యార్థి దుర్మరణం

- నేత్రదానం చేసిన తల్లిదండ్రులు
- స్వస్థలం బి.కొత్తకోట మండలం తరిగోడు


మనోజ్ రెడ్డి (ఫైల్)

బనశంకరి : ప్రైవేటు స్కూలు బస్సు ఢీకొన్న సంఘటనలో బైక్‌పై వెళ్తున్న ఇంజినీరింగ్ విద్యార్థి దుర్మరణం చెందాడు. ఈ ఘటన బెంగళూరు దేవనహళ్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాలు.. అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లి నియోజకవర్గం బి.కొత్తకోట మండలం తరిగోడు గ్రామానికి చెందిన రెడ్డెమ్మ, రామేశ్వరరెడ్డి దంపతుల రెండవ కుమారుడు మనోజ్‌రెడ్డి (19) యలహంకలో తల్లిదండ్రులతో ఉంటున్నాడు. చిక్‌బళ్లాపూర్‌లోని ఎస్‌జేసీఐటీ ఇంజినీరింగ్ కాలేజీలో రెండవ ఏడాది బీటెక్ చదువుతున్నాడు. మంగళవారం ఉదయం బైక్‌పై కాలేజీకి బయలుదేరాడు. దేవనహళ్లి దగ్గర ఓ ప్రైవేటు స్కూల్‌బస్ వేగంగా వచ్చి ఢీకొనగా, మనోజ్‌రెడ్డి తీవ్రగాయాలపాలై మరణించాడు. ట్రాఫిక్ పోలీసులు మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు.

కన్నవారి మానవత్వం

మనోజ్‌రెడ్డి తల్లిదండ్రులు పుట్టెడు దుఃఖంలోనూ మానవత్వాన్ని చాటుకున్నారు. కుమారుని కళ్లను దానం చేశారు. యలహంక ఎమ్మెల్యే ఎస్ఆర్.విశ్వనాథ్, పెద్ద సంఖ్యలో తెలుగువారు, స్థానికులు ఆ కుటుంబాన్ని పరామర్శించారు. రామేశ్వరరెడ్డి, రెడ్డెమ్మ దంపతులు గత 30 ఏళ్లుగా యలహంకలోని కొండప్పలేఔట్‌లో జీవిస్తూ మరమగ్గాలను నిర్వహిస్తున్నారు. బుధవారం స్వగ్రామం తరిగోడులో అంత్యక్రియలను నిర్వహిస్తామని తెలిపారు.

దొంగతనానికి వచ్చాడనే అనుమానంతో దాడి

మదనపల్లె : ఇంట్లో దొంగతనానికి వచ్చాడనుకుని, కర్ణాటకకు చెందిన ఓ వ్యక్తిని బసినికొండ స్థానికులు చితకబాదిన ఘటన సోమవారం మదనపల్లె మండలంలో జరిగింది. రామసముద్రం మండలం కర్ణాటక సరిహద్దు గ్రామానికి చెందిన ఉమేష్‌బండారి(40) సోమవారం మధ్యాహ్నం బసినికొండ పరిసర ప్రాంతాల్లో అనుమానాస్పదంగా సంచరిస్తూ కనిపించాడు. స్థానికులు మందలించడంతో భయపడ్డ ఉమేష్ అక్కడి నుంచి వెళ్లిపోతూ, మార్గమధ్యంలో ఓ ఇంటిలోకి చొరబడ్డాడు. దీంతో దొంగతనం చేసేందుకే ఇంట్లోకి వచ్చాడంటూ స్థానికులు ఉమేష్‌ను చితక్కొట్టారు. దాడిలో అతను తీవ్రంగా గాయపడి అక్కడే సొమ్మసిల్లి పడిపోవడంతో స్థానికులు 108కు సమాచారం అందించారు. జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అయితే ఉమేష్... దొంగతనానికి వచ్చాడా..? లేక మరేదైనా కారణంతో ఇంట్లోకి చొరబడ్డాడా అనే విషయాన్ని ఎంత ప్రశ్నించినా చెప్పడం లేదు. రూరల్ పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి


మృతి చెందిన మల్లికార్జున

మదనపల్లె : కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన సోమవారం పట్టణంలో జరిగింది. టూటౌన్ పోలీసుల కథనం మేరకు... మండలంలోని సీటీఎం గ్రామం రేగడకు చెందిన గంగులప్ప కుమారుడు సారంగుల మల్లికార్జున(28) అమ్మచెరువుమిట్టలో కాపురం ఉంటూ టైల్స్ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. భార్య మాధవి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా కురబలకోటలోని తన సోదరి ఇంటికి వెళ్లి వస్తానని మాధవి భర్తను అడిగింది. దీనికి అతడు ఒప్పుకోకపోవడంతో భార్యాభర్తలు ఇద్దరూ గొడవపడ్డారు. అనంతరం భర్త మల్లికార్జున ఇంటిలోనే చీరతో ఉరివేసుకుని కనిపించాడు. సమాచారం అందుకున్న టూటౌన్ ఎస్ఐ వెంకటసుబ్బయ్య సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. మల్లికార్జున మృతిపై తమకు అనుమానం ఉందని కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. దీంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నవశకం

ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారిపోయాయి



నాడు-నేడు ద్వారా కనీవినీ ఎరుగని రీతిలో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. పాఠశాలలో చదువుకున్న పూర్వవిద్యార్థులు పాఠశాలను చూసి తాము చదువుకున్న పాఠశాల ఇదేనా అని ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. నూతన తరగతి గదుల నిర్మాణం, బెంచీలు, ఆధునాతన టాయిలెట్‌లు, ఫ్యాన్‌లు, పుష్టికరమైన మధ్యాహ్నభోజనం తదితర అన్ని సౌకర్యాలను కల్పించారు. లక్షల రూపాయల ఫీజు కట్టే కార్పొరేట్ స్కూళ్లలో కూడా లేని ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ బోర్డ్స్(ఏఎఫ్‌పీ ప్యానల్స్) ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన జరుగుతోంది. అత్యాధునిక పద్ధతుల ద్వారా జ్ఞానాన్ని అందించే విధంగా ప్రభుత్వం తీసుకుంటున్న విప్లవాత్మక మార్పులు ప్రశంసనీయం. – కాశీప్రసాదరెడ్డి, వైఎస్‌మున్సిపల్ హైస్కూల్, ప్రొద్దుటూరు.

ఇంటి వద్దకే ధ్రువీకరణ పత్రాలు



గ్రామ సచివాలయ వలంటీర్ వచ్చి ఆధార్‌కార్డుతో పాటు రేషన్ కార్డు తీసుకొని మా సచివాలయం పరిధిలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో దరఖాస్తు చేయించారు. తర్వాత ఇంటి వద్దకే వచ్చి పలు రకాల ధ్రువీకరణపత్రాలు అందజేశారు. నాకు కుల, ఆదాయ ధ్రువీకరణపత్రాలు ఉచితంగానే అందాయి. గతంలో మా పిల్లల చదువుల నిమిత్తం వీటి కోసం తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరగాల్సి వచ్చేది. ఇప్పుడు ఉచితంగా ఇంటికే తెచ్చి ఇవ్వడం ఎంతో సంతోషంగా ఉంది. – టి.రమణ, కొత్తపల్లి, చిన్నమండెం మండలం

సొంతింటి కల నెరవేరింది



నేను ఒంటరి మహిళను. కూలి పనులకు వెళ్లి జీవనాన్ని కొనసాగిస్తున్నాను. కనీసం నాకు ఇల్లు కూడా లేదు. తెలిసిన వారి ఇంట్లో ఉన్నాను. గతం ప్రభుత్వంలో ఇంటి స్థలం కోసం అర్జీలు పెట్టుకున్నా మంజూరు కాలేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన వచ్చిన తరువాత నాకు ఇంటి స్థలంతో పాటు ఇల్లు కూడా మంజూరైంది. ఇప్పుడు నేను జగనన్న కాలనీలో ఇల్లు నిర్మించుకున్నాను. అక్కడే నివాసం ఉంటున్నాను. జగనన్న పుణ్యమా అని నాకు సొంత ఇంటి కల నెరవేరింది. – నేతగాని శేషమ్మ, జగనన్న కాలనీ, సిద్దవటం

రైలు కింద పడి ఇద్దరికి గాయాలు



గాయపడిన జంగం క్రాంతి,, దేవరాజు

కడప కోటిరెడ్డి సర్కిల్ : కడప రైల్వే స్టేషన్ పరిధిలోని వేర్వేరు ప్రాంతాల్లో మంగళవారం రైలు కింద పడి ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. కడప-కృష్ణాపురం ఎగువ రైలు పట్టాలపై జంగం క్రాంతి (28) అనే యువకుడు గూడ్స్ రైలు కింద పడటంతో గాయాలయ్యాయి. అలాగే బాక్రాపేట రైల్వే గేట్ సమీపంలో అన్నమయ్య జిల్లా గాలివీడుకు చెందిన దేవరాజు (36) రైలు కిందపడి గాయపడ్డాడు. వీరిద్దరిని కడప రిమ్స్‌కు తరలించామని రైల్వే ఎస్ఐ రారాజు తెలిపారు.

గాయపడిన వ్యక్తి మృతి

కడప కోటిరెడ్డి సర్కిల్ : కడప-కృష్ణాపురం దిగువ రైలు పట్టాలపై కన్యాకుమారి ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి తీవ్రంగా గాయపడిన ఎస్.ఖాదర్(36) అనే వ్యక్తి మంగళవారం మృతి చెందినట్లు రైల్వే ఎస్ఐ రారాజు తెలిపారు. ఆదివారం రైలు కింద పడి గాయపడిన ఖాదర్‌ను కడప రిమ్స్ ఆ తర్వాత తిరుపతి రుయాకు తరలించామని ఆయన తెలిపారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడన్నారు. కడప నగరం కుమ్మరి వీధికి చెందిన ఖాదర్ కార్పెంటర్‌గా పనిచేస్తున్నాడు. కుటుంబ కలహాలతో రైలు కిందపడి చనిపోయాడని ఆయన తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

లారీ ఢీకొని..

పెద్దముడియం : మండలంలోని పెద్దపసుపుల గ్రామానికి చెందిన వై.విశ్వనాథరెడ్డి(64) అనే వ్యక్తి సోమవారం జమ్మలమడుగు పట్టణ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించాడు. పెద్దపసుపుల గ్రామానికి చెందిన విశ్వనాథరెడ్డికి భార్య, ఇద్దరు కూమార్తెలు, కుమారుడు ఉన్నారు. వీరందరికీ వివాహాలయ్యాయి. ఇతను వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు. సోమవారం వ్యక్తిగత పనుల నిమిత్తం జమ్మలమడుగు వస్తుండగా వేగంగా వెళుతున్న లారీ ఇతనిని ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పండగ రోజు ఇంటి పెద్ద మృతి చెందడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

ఉత్సాహంగా బండలాగుడు పోటీలు


వెదురూరులో జన సందోహం నడుమ బండలాగుతున్న ఎద్దులు


నరహరిపురం గ్రామంలో బండలాగుడు పోటీలను తిలకిస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, నాగిరెడ్డి

పోటీలను తిలకించిన మైదుకూరు ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

చాపాడు : సంక్రాంతి కనుమ వేడుకల సందర్భంగా మండలంలోని ఒకే పంచాయతీలోని వెదురూరు, నరహరిపురం గ్రామాలలో మంగళవారం రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు నిర్వహించారు. వేలాది మంది జన సందోహం నడుమ జరిగిన ఈ బండలాగుడు పోటీలను మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి ఆసక్తిగా తిలకించారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త శెట్టిపల్లె నాగిరెడ్డి పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యాన సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, ఎంపీపీ లక్షుమయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు చిన్నవీరారెడ్డి, ఎల్లారెడ్డి, వీరారెడ్డి, మహేశ్వరరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, వెలుగు రమణారెడ్డి, శంకర్‌రెడ్డి, గంగులయ్య, శ్రీకాంత్‌రెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

వెదురూరులో..

వెదురూరులో జరిగిన బండలాగుడు పోటీలలో నంద్యాల జిల్లా కానాల గ్రామం గుండం చెన్నారెడ్డి, వైఎస్సార్ జిల్లా వైఎంఆర్ కాలనీకి చెందిన ద్వార్శల గురివిరెడ్డి ఎద్దులు 2166 అడుగులతో ప్రథమ స్థానంలో నిలువగా, నంద్యాల జిల్లా పెసరవాయి గ్రామానికి చెందిన సయ్యద్‌కమాల్ బాషా ఎద్దులు 1608 అడుగులతో ద్వితీయ, నంద్యాల జిల్లా కానాల గ్రామానికి చెందిన గురునేహారెడ్డి, గుండం చెన్నారెడ్డి ఎద్దులు 1603 అడుగులతో తృతీయ బహుమతి పొందాయి. నంద్యాల జిల్లా శిరివెల్ల మండలం మొక్కలపల్లెకు చెందిన మహేశ్వర్‌రెడ్డి ఎద్దులు 1524 అడుగులతో నాలుగో స్థానంలో, నంద్యాల జిల్లా గుడిపాడుకు చెందిన కొప్పుల తిమ్మారెడ్డి ఎద్దులు 1130 అడుగులతో ఐదో స్థానంలో గెలుపొందాయి. గెలిచిన ఎడ్ల యజమానులకు వరుసగా రూ.1,00,116లు, రూ.70వేలు, రూ.40వేలు, రూ.20వేలు, రూ.10వేలు అందించారు.

నరహరిపురంలో..

నరహరిపురం గ్రామంలో జరిగిన బండలాగుడు పోటీలలో నంద్యాల జిల్లా డోన్‌కు చెందిన ధర్మవరం సుబ్బారెడ్డి ఎద్దులు 2562 అడుగులతో ప్రథమ స్థానంలో నిలువగా, వైఎస్సార్ జిల్లా వల్లూరు మండలం బాలుగారిపల్లెకు చెందిన ఇందిరెడ్డి రమణారెడ్డి ఎద్దులు 2001 అడుగులతో ద్వితీయ, అనంతపురం జిల్లా చెర్లోపల్లెకు చెందిన నంద్యాల శివరామిరెడ్డి ఎద్దులు 1766 అడుగులతో తృతీయ, నంద్యాల జిల్లా పీఆర్ పల్లెకు చెందిన బంటుపల్లె శివ ఎద్దులు 1700 అడుగులతో నాలుగో స్థానంలో గెలిచాయి. గెలిచిన ఎద్దుల యజమానులకు రూ.1,00,116, రూ.70వేలు, రూ.50వేలు, రూ.40వేలు చొప్పున నగదు అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు.